క్లుప్తంగా

ఈడుపుగల్లు మహిళకు ఆటో అందజేత



పెనమలూరు: ఈడుపుగల్లుకు చెందిన మహిళకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆటో అందచేశారు. కానూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్థసారథి ఈడుపుగల్లుకు చెందిన బండి జ్యోతికి ఎస్సీ సబ్ ప్లాన్ కింద సున్నా వడ్డీతో రూ.3.30 లక్షలు విలువ చేసే ట్రాలీ ఆటో అందచేశారు. పేదల ఉపాధికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: నేడు పోరంకి ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు అన్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు లైన్ల మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని చెప్పారు. నిడమానూరు రోడ్డు, ప్రభునగర్, క్యాపిటల్ ఆస్పత్రి ప్రాంతం, డొంక రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: 132 కేవీ కానుమోలు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ టి.రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్‌జంక్షన్, ఆరుగొలను, బొమ్ములూరు, మడిచర్ల విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు.

24న అరుణాచల గిరిప్రదక్షిణకు బస్సు

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 24న అరుణాచల గిరిప్రదక్షిణ యాత్ర కోసం ప్రత్యేక బస్సు నడపనున్నట్లు డీఎం పి. శివాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరి 25వ తేదీ ఉదయం శ్రీకాళహస్తికి చేరుకుంటుందన్నారు. అదే రోజు కాణిపాకం, శ్రీపురం ఆలయాల దర్శనం నిమిత్తం రాత్రికి అరుణాచలంకు చేరుకుంటారని తెలిపారు. 26న ఉదయం గిరిప్రదక్షిణ, స్వామివారి దర్శనం, సాయంత్రం కంచి ఆలయ దర్శనం అనంతరం రాత్రికి బస్సు బయలుదేరి 27వ తేదీ ఉదయం 10 గంటలకు గన్నవరం చేరుకుంటుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సు టిక్కెట్ ధర రూ. 3 వేలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాచారం కోసం 8790996090, 7382905633 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు పెన్షనర్ల సభ

గన్నవరం: స్థానిక బుద్ధవరం రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవాభవన్‌లో ఈ నెల 17న ఏపీ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల దినోత్సవ వార్షిక సభ ఏర్పాటు చేసినట్లు ఆ సంఘ గన్నవరం సబ్‌ట్రెజరీ యూనిట్ అధ్యక్షుడు ఎ. మోహన్‌రావు శుక్రవారం తెలిపారు. ఈ సభలో పెన్షనర్ల సమస్యలపై చర్చించడంతో పాటు 75 ఏళ్లు నిండిన పెన్షనర్లను సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కంకిపాడు: పేద కుటుంబాలకు రాచూరి ఫౌండేషన్ అండగా నిలుస్తుందని రాచూరి ఫౌండేషన్ ప్రతినిధి, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి అన్నారు. కంకిపాడు పట్టణంలోని పాశం లక్ష్మణస్వామి నగర్‌కు చెందిన నన్నం సీత మృతి చెందటంతో ఫౌండేషన్ నుంచి రూ.10 వేలు ఆర్థిక సాయం శుక్రవారం అందించారు. ఏఎంసీ డైరెక్టర్ మరియబాబు, సచివాలయ కన్వీనర్లు బాకీ రాజేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

తాడిగడపలో సెమీ క్రిస్మస్




పెనమలూరు: తాడిగడపలో శుక్రవారం జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారిచే క్రిస్మస్ కేక్‌కట్ చేసి తినిపించారు. క్రిస్మస్ పండుగను అందరు భక్తి శ్రద్ధలతో ఘనంగా చేసుకోవాలని తెలిపారు. పాస్టర్ నారాయణ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు బొప్పన భవకుమార్, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాలవరపు బాబీ, వైఎస్సార్ సీపీ నేతలు కాకిశ్రీనివాసరావు, కటికల క్రిష్టోఫర్, భక్తులు పాల్గొన్నారు.

సోమేపల్లి మృతి తీరనిలోటు

విజయవాడ కల్చరల్: ఏపీ రచయితల సంఘం అధ్యక్షుడు సోమేపల్లి వెంకటసుబ్బయ్య మృతి సాహితీ రంగానికి తీరనిలోటని రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. కవిగా సోమేపల్లి కవితా సంపుటులు ప్రచురించినట్లు పేర్కొన్నారు. ఏపీ రచయితల సంఘం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సాహితీ సదస్సులు నిర్వహించారని తెలిపారు. ప్రభుత్వంలో అనేక ఉన్నత పదవులను అలంకరించినట్లు పేర్కొన్నారు. గోళ్ల నారాయణరావు, బోడి ఆంజనేయరాజు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ వెన్నావల్లభరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఇంటింటికీ సంక్షేమం వైఎస్సార్ సీపీ లక్ష్యం



సూరంపల్లిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన నాయకులు, అధికారులు

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి సచివాలయం–2 పరిధిలో శుక్రవారం వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంపీపీ అనగాని రవి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూరు శాతం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసి చరిత్ర సృష్టించారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య కోరారు. పేదలకు పాలన దగ్గరకు చేర్చి గ్రామ స్వరాజ్యాన్ని మన ముందు నిలిపారని చెప్పారు. సంక్షేమాన్ని ప్రతి గడపకు అందించటం ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే చెల్లిందన్నారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ పథకాలు మరింతగా అమలు కావాలంటే ఈ రాష్ట్రానికి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనిని ప్రజలు గమనించాలని చెప్పారు. అందుకే ప్రజల ఆశీర్వాదం సీఎంకు అందించాలని విజ్ఞప్తి చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ కోట్లాది రూపాయలు ప్రజలకు వివిధ రూపాల్లో పారదర్శకంగా సంక్షేమ పథకాలతో అందించిన సీఎంను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటేశ్వరమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కందిమళ్ల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బండి శివరామయ్య, మండల వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ పామర్తి మాధవరావు, సహకార బ్యాంకు చైర్ పర్సన్ తుల్లిమిల్లి ఏడుకొండలు, వార్డు సభ్యులు కందిమళ్ళ రాఘవ, రామచంద్రాపురం వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ సర్నాల రాంబాబు, బండి వెంకటేశ్వరరావు, కూరాకుల కోటేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి కోట సురేష్‌బాబు, వీఆర్వో అర్జునరావు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు.

జగనన్న పాలన స్వర్ణయుగం...

హనుమాన్‌జంక్షన్ రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పరిపాలన స్వర్ణయుగం లాంటిదని జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవిర్నేని శేషగిరిరావు అన్నారు. బాపులపాడు మండలం వేలేరులోని గ్రామ సచివాలయం ప్రాంగణంలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అర్హులైన ప్రతి పేదవాడికి కుల, మత, రాజకీయ పక్షపాతం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. పేదల జీవన స్థితిగతులు మార్చటమే అసలైన అభివృద్ధిగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వేలేరులో సుమారు రూ.58 కోట్ల మేర పలు అభివృద్ధి పనులు నిర్వహించామని తెలిపారు. రూ. 23.41 కోట్ల వ్యయంతో వేలేరు నుంచి వయా సీతారామపురం, పల్లెర్లమూడి మీదగా బొమ్ములూరు వరకు రహదారి విస్తరణ, రూ. 4.85 కోట్ల వ్యయంతో నిర్వహించిన సచివాలయం, ఆర్బీకే, హెల్త్ సెంటర్ భవనాలు, మన బడి నాడు–నేడు పనులు నిదర్శనంగా నిలిచాయని తెలిపారు. వేలేరు సచివాలయం పరిధిలో గడిచిన నాలుగున్నరేళ్లలో ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా వివిధ పథకాల లబ్ధిదారులకు రూ. 20.76 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా మరో రూ.9.20 కోట్ల మేర నగదు పంపిణీ జరిగిందని వివరించారు. ప్రతి ఇంటా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు ఉన్నారన్నారు. తొలుత సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆయన ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీటీసీ సభ్యురాలు మురుదుడ్డి యోహాన్, సర్పంచ్ చొదిమెళ్ల సుందరమ్మ, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.



వేలేరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న శేషగిరిరావు



పాతపాడులో బోర్డు ఆవిష్కరిస్తున్న నాయకులు

పేదల దేవుడు జగనన్న

పాతపాడు(విజయవాడరూరల్): పేద, బడుగు, బలహీన వర్గాలకు దేవుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు అన్నారు. పాతపాడు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సువర్ణరాజు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే మన భావితరాలకు మంచి భవిష్యత్ అందుతుందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వరరావు (ఆర్‌వీఆర్) మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో ముందెన్నడూ లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగనన్న పాలన సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ శీలం రంగారావు మాట్లాడుతూ జగనన్న పాలనలో పాతపాడు గ్రామానికి నాలుగున్నర సంవత్సరాల్లో 25 కోట్ల 10లక్షల రూపాయల లబ్ధి చేకూరిందన్నారు. చేసిన మేలును దృష్టిలో ఉంచుకొని జగనన్నను ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ సాదం వెంకటేశ్వరావు, గ్రామ ఉపసర్పంచ్ మరీదు స్వప్న, ఎంపీటీసీ సభ్యుడు మరీదు బాలకోటేశ్వరావు, ఈఓఆర్డీ బిఎల్‌వీ శేషగిరిరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావు, గ్రామ సచివాలయ సిబ్బంది, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు. సంక్షేమ పథకాల బోర్డుతో పాటు పార్టీ జెండా ఆవిష్కరించారు.

కుంగ్‌ఫూలో విద్యార్థులకు బంగారు పతకాలు



కంకిపాడు: జాతీయ స్థాయి కుంగ్‌ఫూ–కరాటే చాంపియన్‌షిప్‌లో గోసాల హెచ్‌ఎంకే విద్యార్థులు సత్తా చాటారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను శుక్రవారం పాఠశాల డైరెక్టర్ ఆర్.వసంత్‌కుమార్, ప్రిన్సిపాల్ సుక్‌మిత్ కౌర్ పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4వ జాతీయ స్థాయి కుంగ్‌ఫూ–కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 10న నందిగామలో ఓసీ క్లబ్‌లో జరిగాయన్నారు. పోటీల్లో క్రీడాకారులు వై.నిరుపమ, ఎస్.ప్రేమ్‌కుమార్, పి.లియాకత్, అలిఖాన్, ఎం.శ్రీ బాలసాయి, ఎ.అఖిల్ సాయి, బి.గీతమ్ ప్రహర్ష, బి.వశిష్టసాయి, కె.లోహిత్, ఎం.హర్షవర్ధన్ బంగారు పతకాలను సాధించారన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అందుకు అనుగుణంగానే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కుంగ్‌ఫూ కోచ్ డి.రామాంజనేయులును అభినందించారు.

బాలోత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ



పెనమలూరు: వీవీఐటీ బాలోత్సవ్‌లో పోరంకి భాష్యం బ్లూమ్స్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పాఠశాల చైర్మన్ భాష్యం రామకృష్ణ శుక్రవారం వివరాలు తెలుపుతూ ఈ నెల 11 నుంచి 13 వరకు నంబూరు వీవీటీలో జరిగిన బాలోత్సవ్‌లో తమ విద్యార్థులు డ్రమ్స్ విభాగంలో దర్శిత్ సాయి ప్రథమ బహుమతి, కీ బోర్డులో వల్లమూడి నాగహర్షిత తృతీయ స్థానం సాధించారన్నారు. చదువుతో పాటు వివిధ అంశాల్లో ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

పేదల హృదయాల్లో చిరస్థాయిగా జగనన్న



మాట్లాడుతున్న నక్కా గాంధీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ అన్నారు. మండల కేంద్రమైన బాపులపాడులోని జగనన్న కాలనీ–2లో ఇళ్ల స్థలాల పోజిషన్ కేటాయింపు శుక్రవారం అట్టహాసంగా సాగింది. బాపులపాడు జగనన్న కాలనీ–2లో 644 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు కావటంతో రెవెన్యూ అధికారులు వీరికి ప్లాట్లు కేటాయించారు. దీంతో అధిక సంఖ్యలో లబ్ధిదారులు తరలిరావటంతో జగనన్నకాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నక్కా గాంధీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గతేడాది బాపులపాడులో తొలివిడతగా సుమారు 600 మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేయగా, రెండవ విడతలో 20 ఎకరాల లే అవుట్‌ను ఏర్పాటు చేసి మరో 621 మందికి పట్టాలను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని చెప్పారు. ఇళ్ల స్థలాలు పంపిణీ చేయటమే కాకుండా వైఎస్సార్ జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవిర్నేని శేషగిరిరావు మాట్లాడుతూ పేదల కనీస అవసరాలను తీర్చటం ప్రభుత్వ బాధ్యతగా భావించి ఎంత ఖర్చు అయిన భరిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అన్నారు. ఇంటి స్థలం పోజిషన్ కేటాయింపు జరిగిన లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పలువురు లబ్ధిదారులు పట్టాలు స్వీకరించిన తర్వాత సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే వంశీలకు జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రావాలంటూ తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు. తహసీల్దార్ సీహెచ్ నరసింహరావు, డిప్యూటీ తహసీల్దార్ కె.వెంకట రమణ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలభాయి, పీఏసీఎస్ చైర్మన్ దయాల విజయనాయుడు, ఎంపీటీసీ సభ్యులు నూకల జ్యోతి, పడకల కోటేశ్వరరావు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ తానీషా, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ముస్తాబాదలో ఘనంగా గుణదల మాత యాత్ర



ప్రత్యేక ప్రార్థనలో జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాదలో శుక్రవారం రాత్రి గుణదల మేరీ మాత విగ్రహం ఊరేగింపు కార్యక్రమం స్థానిక విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ జోసఫ్ కాకాడ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. గుణదల మేరీ మాత దేవాలయం 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా జరిగిన ఈ యాత్రలో ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి పాల్గొని స్వాగతం పలికారు. మరియ మాత విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. మరియమాత ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షించారు. ఎంతో మహిమగల గుణదల మాత దేవాలయం 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో జరుగుతున్న ఈ ఉత్సవాలు ప్రజలకు శాంతి, సహనం, కరుణ అందించాలని ఆకాంక్షించారు. మరియమాత జీవితం మనందరికీ స్ఫూర్తి దాయకమని చెప్పారు. యాత్రలో భక్తులు కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనల్లో పాల్గొని మరియ మాతను ఆరాధించారు. ముస్తాబాద విచారణ భక్తులు, పెద్దలు, మరియదళం, యూత్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న వరి పంట పరిశీలన



గంగూరులో దెబ్బతిన్న వరి పంట పరిశీలిస్తున్న ఏడీఏ సునీల్



ప్రొద్దుటూరులో నేలవాలిన వరి పొలాలు పరిశీలిస్తున్న ఏవో కిరణ్

పెనమలూరు: తుపాను కారణంగా వరి పంట నష్టపోయిన రైతులు వారి వివరాలు తెలపాలని ఏడీఏ ఎం.సునీల్ అన్నారు. ఆయన శుక్రవారం గంగూరులో తుపాను కారణంగా నష్టపోయిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా సునీల్ వివరాలు తెలుపుతూ పంట నష్టం జాబితాతో వివరాలు క్షేత్రస్థాయిలో సిబ్బంది సిద్ధం చేస్తున్నారని చెప్పారు. తుపానుతో పంట నష్టం జరిగిన రైతులు ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. ఇప్పటికే హెక్టార్‌కు రూ.17 వేలు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. వీఏఏ జమీల అంజుమ్, రైతులు పాల్గొన్నారు.

కంకిపాడు: తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని మండల వ్యవసాయాధికారి పిఎం కిరణ్ అన్నారు. ప్రొద్దుటూరు, దావులూరు, కొణతనపాడు, కోలవెన్ను, ఉప్పలూరు గ్రామాల్లో తుపాను ముంపు బారిన పడ్డ పంట పొలాలను పరిశీలించారు. కిరణ్ మాట్లాడుతూ పంట నష్టం వాటిల్లిన ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పంట నష్టం సర్వే జరుగుతుందన్నారు. మార్గదర్శకాలకు అనుగుణంగా, నష్టం వాటిల్లిన ప్రతి పంట నమోదు చేసి, బాధిత రైతాంగానికి అండగా ఉంటామని చెప్పారు.

మెప్మా బజారు ప్రారంభం



ఉయ్యూరు: పేదరిక నిర్మూలనే మెప్మా లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. బస్టాండు సెంటరులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా మెప్మా బజారును శుక్రవారం ప్రారంభించారు. డ్వాక్రా మహిళలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సందర్శించి కొనుగోళ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ వల్లభనేని మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని చెప్పారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ తెనాలి పద్మావతి, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు శక్తినగర్‌లో శుక్రవారం పైప్‌లైన్ మరమ్మతులు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ మాట్లాడుతూ మరమ్మతులకు గురైన పైప్‌లైన్‌తో ఈ ప్రాంతవాసులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని వెంటనే పరిష్కరించినట్లు తెలిపారు. గ్రామంలో సురక్షిత తాగునీరు సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు.

86 మందికి వైద్య పరీక్షలు



గన్నవరం: క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పార్థసారథి సూచించారు. స్థానిక కొత్తపేటలోని డాక్టర్ సీఎల్. రాయుడు రోటరీ ఆడిటోరియంలో శుక్రవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మణిపాల్ ఆస్పత్రి సహకారంతో క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షల శిబిరం నిర్వహించారు. శిబిరంలో 86 మందికి క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేసినట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్ తెలిపారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి నర్రా సీతారామారావు, రోటేరియన్లు చింతపల్లి సీతారామయ్య, టీఎస్ఆర్‌కె. ప్రసాద్, గన్నె వెంకట్రావు, జీవీ. రవికుమార్ పాల్గొన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ప్రదర్శన



ఈవీఎంలతో ఉన్న వాహనాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ వెంకటశివయ్య

పెనమలూరు: ఈవీఎం మిషన్‌లపై ప్రజలకు అవగాహన కల్పించటానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపారు. ఆయన శుక్రవారం పెనమలూరులో ఈవీఎంలతో ఉన్న వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు తెలుపుతూ భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రజలకు ఈవీఎం మిషన్ల పై అవగాహన కల్పించటానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మిషన్ ఏర్పాటు చేసి ప్రజలకు ఓటు ఎలా వేయాలో పూర్తిగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. పెనమలూరు నియోజకవర్గంలో మొత్తం 304 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలను ఏర్పాటు చేసి ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఈవీఎంలపై అవగాహన 45 రోజులు పాటు పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. కాగా శుక్రవారం కానూరు గ్రామంలో ఈవీఎంలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ భవాని, ఆర్ఐ రమేష్, రెవెన్యూ సిబ్బంది పోలీసులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై ప్రదర్శన

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్టెల్లా కళాశాల విద్యార్థినులు ఆరోగ్యం–పోషకాహారం అంశంపై 3, 4, 5 తరగతుల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు లభించే ఆహార పదార్థాల గురించి వివరించారు. జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉంటూ పండ్లు, పోషకాహారాలు తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యల నుంచి దూరం కావచ్చన్నారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు శుక్రవారం మృతి చెందింది. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి శ్రీనివాసానగర్‌కు చెందిన వి.వరాలమ్మ (65) ఈ నెల 2వ తేదీన కృష్ణవేణి పాఠశాల వద్ద రోడ్డు దాటుతుండగా ఆమెను కంకిపాడు వైపు నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్రగాయమై ఆస్పత్రిలో చికిత్సకు చేర్చారు. కాగా ఆమె ఆస్పత్రి నుంచి 9వ తేదీన ఇంటికి తీసుకొచ్చి చికిత్స చేయిస్తున్నారు. అయితే ఆమె పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి కుమారుడు వి.సన్నీబాబు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వణుకూరులో అరటి తోట నరికివేత



గోసాలలో నరికిన అరటి తోట

పెనమలూరు: వణుకూరులో గుర్తు తెలియని వ్యక్తులు సన్నకారు రైతు అరటి తోట నరికి దురాగతానికి పాల్పడ్డారు. వణుకూరు గ్రామంలో ఆర్ఎస్‌నెంబర్ 256/1లో పద్మకు 60 సెంట్ల అరటి తోట ఉంది.ఈ అరటి తోటను తాడిగడపకు చెందిన దళిత కౌలురైతు పొనుగుమాటి రమేష్ సాగు చేస్తున్నాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి అరటి తోటను నరికివేశారు. దాదాపు 200 అరటి చెట్లను నరికి నేలమట్టం చేశారు. గెలదశలో ఉన్న అరటి తోట పూర్తిగా నేలమట్టమైంది. రైతు రమేష్ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు తన అరటి తోటను నరకటం వలన పూర్తిగా నష్టపోయానన్నారు. తన తోటను ఎందుకు నరికారో తెలియటం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.. తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం పెనమలూరు గ్రామ, డోర్ నెం: 4-96 వాస్తవ్యులు [illegible] ... [illegible] క్రయ దస్తావేజు నెం: 3128/2010 [illegible] ... ది.17-05-2021న [illegible] ... ది. 26-04-2023న విజయవాడ సబ్ రిజిస్ట్రారు [illegible] దస్తావేజు నెం: 5195/2023గా [illegible] ... ఐ.ఎ నెం: 544/2023 ఇన్ ఓ.యస్ నెం: 2395/2023 [illegible] ... [illegible]

షెడ్యూలు:- కృష్ణాజిల్లా, కంకిపాడు సబ్ రిజిస్ట్రారు [illegible] ... ఆర్.యస్ నెం: 223లో [illegible] చ.గ. 210 [illegible] ... చ.గ. 210లు [illegible]

ఇట్లు:-
ప్రత్తిపాటి యస్.వి ప్రసాదరావు,
శ్రీమతి కె.తేజోమయి,
ఎస్.రాజేశ్వరి,
జి.ఫణి కుమార్
న్యాయవాదులు
డోర్ నెం:24-24-23/ఎ, [illegible], దుర్గాపురం, విజయవాడ-3,
ఫోన్:9848264219
Vijayawada, date.15/12/23

వంద రోజుల ఉపాధి కల్పించాలి

విజయవాడరూరల్: వచ్చే 2024–25వ సంవత్సరానికి ఉపాధి పథకం కింద కూలీలకు లక్షా 80 వేల పని దినాలను ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని ఎంపీడీఓ బి.భార్గవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై శుక్రవారం సమీక్షించారు. భార్గవి మాట్లాడుతూ మండలంలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధి కూలీలకు 100 రోజుల పనిదినాలను కచ్చితంగా ఉండేలా చూడాలని మేట్‌లను ఆదేశించారు. నున్న, కొత్తూరు తాడేపల్లి గ్రామాల్లో ఉపాధి కూలీలకు సంబంధించి వేతనాల చెల్లింపుల్లో ఇబ్బందులు లేకుండా పోస్టాఫీసుల్లో ఖాతాలను తెరవాలని సూచించారు. ఇంజినీరు కన్సల్టెంట్ శ్రీనివాస్, టీఏ కిరణ్మయి, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు మేలు

గన్నవరం: గత 21 ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసులను రెగ్యులర్ చేసిన ఘనత సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ...గత పాలకులు డీఏ, ఇతర అలవెన్స్‌లు, ఇంక్రిమెంట్లు లేకుండా కాంట్రాక్ట్ ఉద్యోగులను నియమించారని చెప్పారు. ఎక్కువగా వైద్య ఆరోగ్య శాఖలో నియామకాలు జరిగాయని తెలిపారు.